4వ వార్డులో చేపడుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులు

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

కొత్తూరు, మార్చి 25: మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్న భరత్‌నగర్ ప్రజలకు త్వరలో తాగునీరు అందనుంది. నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 21న 'నెలలు గడిచినా.. తాగు నీటి కష్టాలే' అనే కథనం ప్రచురితమైంది. సమస్యపై స్పందించిన అధికారులు రోడ్డు పనుల్లో ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైను పునఃరుద్ధరించి కొత్త పైపులు వేసే ప్రక్రియను ప్రారంభించారు. పనులు త్వరలో పూర్తి చేసి కొత్తూరు మున్సిపాలిటీలో 4వ వార్డు భరత్‌నగర్ కాలనీలో ప్రజలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తామని మున్సిపల్ కమిషన్ బాలాజీ తెలిపారు.

కార్మికులకు ఒకపూట పని కల్పించండి

కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 25: మున్సిపల్ కార్మికులకు ఒకపూట పని కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి సిబ్బంది ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ విధానంతో కార్మికులు వచ్చి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 8 గంటల పనిని ఒకేసారి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు చేసేలా అవకాశం కల్పించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్.. ఏప్రిల్ నుంచి ఒకపూట పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నరసింహ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేశ్, లింగస్వామి, జవాన్‌లు మైసయ్య, నర్సింహ, మహిపాల్, జంగయ్య, తరుణ్, సిబ్బంది పోచమ్మ, లక్ష్మమ్మ, పోచయ్య, రవి, పద్మమ్మ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేతలు, ఆశ వర్కర్లు

కొత్తూరు, మార్చి 25: ఆశ వర్కర్ల సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బిసా సాయిబాబా అన్నారు. ఆశ వర్కర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు కొత్తూరు వై జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశలు కొత్తూరు పూలే విగ్రహం నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొత్తూరు వై జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ అందించాలని కోరారు. కనీస జీతం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నెలకు 20వేల లీటర్లు సరఫరా చేయాలి

తుర్కయంజాల్, మార్చి 25 : జీహెచ్ఎంసీలో మాదిరిగా మున్సిపాలిటిలో సైతం ప్రతి ఇంటికీ నెలకు 20వేల లీటర్లు ఉచితంగా సరఫరా చేయాలని కోరతూ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ జీవో 211 ప్రకారం ప్రతి ఇంటికీ నెలకు 20వేల లీటర్ల మంచినీరు ఉచితంగా సరఫరా చేయాలని అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు బలదేవరెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, మార్చి 25: హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయెల్‌ను కత్తితో పొడిచి చంపిన నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు వెంటనే విచారణ జరిపి ఉరిశిక్ష విధించిలే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ఆవరణ నుంచి ప్లకార్డులతో బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ నిందితుడికి ఉరిశిక్ష పడాలని, అదే విధంగా ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో న్యాయవాదులు మల్లేశ్, రామకృష్ణ, శేఖర్, మధు, జగన్‌గౌడ్, గణేశ్, సంతోశ్, కృష్ణ, మల్లేశ్, శీరీశ్, బిక్యానాయక్, మురళీకృష్ణ, నరేందర్, సర్దార్, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరంతరం అంతరాయమే..

రాత్రి వేళల్లోనూ కరెంట్ కట్..

ప్రభుత్వం 24గంటల నిరంతరం విద్యుత్ అని ప్రచారం చేసుకుంటుంది. కానీ నిరంతరం రావడంలేదు. ఉదయం 1గంటపాటు కట్ చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో కరెంట్ వస్తూ పోతూ ఉంటది. ఇక సాయంత్రంపూట ప్రతి రోజు అరగంటపాటు కట్ అవుతుంది. రాత్రి సమయాల్లో కరెంట్ కట్ అవుతుండడంతో ఉక్కపోతవల్ల నిద్రపట్టడం లేదు. ఉక్కపోత నుంచి ఉపశమనంకోసం బయటకు వెళదామంటే బయట దోమల బెడద అధికంగా ఉంది.

- సాజిద్, సంతాపూర్

ఉదయం, సాయంత్రం వేళల్లో బందవుతున్న విద్యుత్ వేసవిలో అధిక వినియోగమే కారణమంటున్న అధికారులు

కేశంపేట, మార్చి 25: ప్రభుత్వం రైతుల వ్యవసాయంతోపాటు గృహాలకు నిరంతర విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్న ప్రకటనలు కాగితాలవరకే పరిమితమవుతున్నాయి. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇలా ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్‌కు కత్తెర పడుతోందని రైతులు, వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఎలాంటి రక్షణ కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, చుట్టూ ముళ్ల పొదలతో ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి నిరంతర విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారిక లెక్కలు ఇలా..

కేశంపేట మండల కేంద్రంతోపాటు కొండారెడ్డిపల్లి, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం, ఇప్పలపల్లి, కొత్తపేట, అల్వాల గ్రామాల్లో 33/11కేవీ 9 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉండగా 2,576 వాటికింద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పని చేస్తున్నాయి. అందులో 6860 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాగా 10112 గృహాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. గృహాలకు సంబంధించి ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో 10కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 166, 15కేవీఏ 208, 25కేవీఏ 154, 16కేవీఏ 28, త్రిఫేస్ కరెంటుకు సంబంధించి 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 1170, 63కేవీఏ 50, 100కేవీఏ 170, 160కేవీఏ 1 ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నాయి.

వేధిస్తోన్న లో వోల్టేజీ సమస్య..

మండల వ్యాప్తంగా ఆయా ఫీడర్ల కింద లోవోల్టేజీ సమస్య తలెత్తుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో బోరు మోటర్ల వద్ద తరచూ ఫీజువైర్లు ఎగిరిపోతున్నాయని, రాత్రి సమయాల్లో సైతం విద్యుత్ ట్రిప్ అవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. వేడి ఉక్కపోతల కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో లోవోల్టేజీ సమస్య తలెత్తుతుందని, అధికారులు లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కేశంపేట సంత బజారులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలు

కంచె లేదు.. పొంచిఉన్న ప్రమాదం..

మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని సంత బజారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగలు చుట్టుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రతి బుధవారం జరిగే సంతలో కూరగాయల వ్యాపారులు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కిందనే కూరగాయలు విక్రయిస్తారని, తీగలు బారిన ట్రాన్స్‌ఫార్మర్‌వల్ల ఏమైనా ప్రమాదం జరుగుతుందేమోనన్న భయాందోళనలో ప్రజలు ఉన్నారు. ఇక మండల కేంద్రంలోని బ్రిడ్జివద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పైకి కంపచెట్లు పాకి రాత్రి సమయాల్లో మంటలు చెలరేగుతున్నాయని సమీప పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మండల వ్యాప్తంగా సబ్ స్టేషన్లు, విద్యుత్ వైర్ల మరమ్మతులు అంటూ విద్యుత్‌ను నిలిపివేస్తున్న అధికారులకు మండల కేంద్రంలోని సంత బజారులో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ కనిపించడంలేదా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లేమామిడిలో ప్రధాన రహదారి పక్కనే తక్కువ ఎత్తులో ఎలాంటి కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

మొయినాబాద్, మార్చి 25 : ప్రతి రోజూ భుజానికి పుస్తకాల బ్యాగు వేసుకుని... నిత్యం తరగతి గదుల్లో అధ్యాపకుల పాఠాలు వింటూ పుస్తకాలతో కుస్తీ పడే విద్యార్థులు ప్రత్యేక వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామాల్లోని సమస్యలతో కుస్తీపడుతున్నారు. ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా హైదరాబాద్‌లోని దోమలగూడలోని ఏవీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-2 వారు మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో సేవా కార్యక్రమాలు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం హనుమాన్ దేలయం ప్రాంగణంలో చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. గ్రామంలో వివిధ అంశాలతో సేవా కార్యక్రమాలు ఏడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు అంజయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు నీరంజన్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాజుగౌడ్, నాయకులు మల్లేశ్, భగవత్‌రెడ్డి, రవికుమార్, అర్జున్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మనుమాన్ దేవాలయంలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న వలంటీర్లు

ఆరోగ్యం, అక్షరాస్యతపై అవగాహన

కేశంపేట, మార్చి 25: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల షాద్‌నగర్ విద్యార్థులు మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఆరోగ్యం, అక్షరాస్యతపై మహిళలు, వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మంగళవారం వృద్ధ మహిళలకు తమపేరు తాము రాసుకునేలా నేర్పించారు. అదేవిధంగా వృద్ధాప్యంలో ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం పూల బొకేను తయారు చేసి ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అప్రోజ్ జహాన్, బింధుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అక్షరాస్యతపట్ల అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

చేవెళ్లటౌన్, మార్చి 25: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో బస్టాండ్ పక్కనుండి గ్రామంలోకి వెళ్లే దారిలో రూ.30లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత పనులు చేపట్టకపోతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ ఆగిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు నర్సింహులు, గిరిధర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కేశంపేట, మార్చి 25: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో బీఆర్ఎస్ యువ నాయకుడు రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ అగర్వాల్‌తో కలిసి దవాఖాన షాద్‌నగర్ వైద్యులు గ్రామంలోని 42మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. 14మందికి శస్త్రచికిత్సకోసం రెఫర్ చేయగా, మరో 22మందికి కంటి అద్దాలను అవసరవుతాయని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందం భరత్‌రెడ్డి, భరత్, రమేశ్, గ్రామస్తులు రాజు, నవీన్, షేర్‌ఖాన్, రమేశ్, శంకర్, ఆనంద్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కొందుర్గు, మార్చి 25: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన కొందర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెలితే.. మండలంలోని ఆగిర్యాల - నవాబ్‌పేట రహదారిలోగల పల్లె ప్రకృతివనంవద్ద గుర్తు తెలియని (35) వయస్సు గల యువకుడు గాయాలతో పడి ఉండడాన్ని చూసిన మాజీ సర్పంచ్ లింగంగౌడ్ పోలీసులకు సమాచారం అందించాడన్నారు. మృతుడు నవాబ్‌పేట మండలం మర్రికల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామని, ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా? మరేదైనా జరిగిందా? అన్న విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడగండ్ల వానకు పంటనష్టం

షాద్‌నగర్‌రూరల్, మార్చి 25 : ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం కురిసిన వడగండ్ల వానకు అక్కడక్కడ వరిపంట దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని బీమారం గ్రామానికి చెందిన లాలయ్యకు చెందిన వరిపంట వడగండ్లకు వానకు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నష్టపోయిన పంటను మంగళవారం ఏఈవో అనిత పరిశీలించారు. ఎక్కడైనా పంట నష్టపోతే వ్యవసాయ అధికారులకు తెలుపాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కొత్తూరు, మార్చి 25: నేషనల్ హైవే 44 తిమ్మాపూర్ వద్ద మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడమే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ హైవే 44 తిమ్మాపూర్ వద్ద కొత్తూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ముందుగా ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ కుడివైపు బోల్తా కొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు రాజుకు గాయాలయ్యాయి. అయితే ఎడుమవైపు నుంచి స్కూటీపై భార్యాభర్తలు వెళ్తున్నారు. లారీ స్కూటీ పైనుంచి వెళ్లడంతో భార్య సక్కుబాయి (38) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త పాండుకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. మృతురాలు సుక్కుబాయి మహేశ్వరం మండలంలో టీడీ తండాలో పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వర్తిస్తుంది. పాండు పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్కూల్ బస్‌లో చెలరేగిన మంటలు

విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తుర్కయాంజాల్, మార్చి 25: షార్ట్ సర్క్యూట్‌తో స్కూల్ బస్ ఇంజన్‌లో మంటలు చెలరేగిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధి ఇంజాపూర్‌లో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్ మంగళవారం విద్యార్థులను ఇంటి వద్ద దింపి వెళ్తున్న సమయంలో సాగర్ ప్రధాన రహదారి ఇంజాపూర్ వద్ద ఇంజన్‌లో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందిచాడు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉంటాయని డ్రైవర్ వాపోయాడు. ప్రమాద సమయంలో బస్‌లో విద్యార్థులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అనధికారిక కోతలు.. రైతులకు తప్పని తిప్పలు

కొత్తూరు, మార్చి 25: అనధికారిక విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బంతులు పడుతున్నారు. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఆ దిశగా పూర్తి సన్నద్ధమైనట్లు కన్పించడంలేదు. కొత్తూరు మండలంలో మొత్తం 20150 రైతు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 850 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గృహ, పరిశ్రమ, రైతులకు విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే 40 మెగా వాట్ల విద్యుత్ అవసరం ఉండగా మొత్తం ఇన్‌పుట్ ఉందని కొత్తూరు ఎలక్ట్రిక్ ఏఈ రమేశ్ తెలిపారు.

అనధికారిక విద్యుత్ కోతలతో అవస్థలు

కొత్తూర మండలంలోని సిద్దాపూర్, ఎస్‌బీ పల్లి, కొడిచెర్ల, గూడూరు, మక్తగూడ, మల్లాపూర్ తదితర గ్రామల్లో వ్యవసాయం చేస్తుంటారు. ముఖ్యంగా 24 గంటల ఫ్రీ కరెంట్ రైతులకు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది. అయితే 24 గంటలు ఉచిత విద్యుత్ రావడంలేదని రైతులు చెబుతున్నారు. ఏదో ఒకసాకుతో రెండు మూడు గంటలు కూడా విద్యుత్ సరఫరా జరుగడంలేదని వాపోతున్నారు. అసలే భూగర్భ జలాలు అడిగంటి పోయాయి. మధ్య మధ్యలో కరెంటు పోవడం వల్ల పూర్తిపంటకు నీరు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కోతల్లేకుండా కరెంటు సరఫారా చేయాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

ప్రధానోపాధ్యాయుడు భీష్వ కృష్ణయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, మార్చి 25: ఉపాధ్యాయులే సమ సమాజ నిర్మాతలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భీష్వ కిష్టయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీష్వ కృష్ణయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మంగళవారం వారు పాల్గొని మాట్లాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా భీష్వ కృష్ణయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటప్ప, నాయకులు బక్కనయాదవ్, భీష్వ రామకృష్ణ, అరుణవెంకట్‌రెడ్డి, విషుగౌడ్, వెంకటేష్, శ్రీను, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక

విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు

కడ్తాల్, మార్చి 25: మత సామరస్యానికి ఇఫ్తారు విందులు ప్రతీకగా నిలుస్తాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు నర్సింహ, దాసు, వెంకటేశ్, సైదులు, రాఘవేందర్, మజీద్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, అహ్మద్‌జానీ, జావిద్, ఇమామ్ జహీరుద్దీన్, ఇర్షాద్, బాబా, ఆజ్గర్ అలీ, రబ్బానీ, గౌస్, లతీఫ్ పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం

కడ్తాల్, మార్చి 25: తలకొండపల్లి గ్రామ యాదవ సంఘం కార్గవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదవ సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. యాదవ సంఘం గ్రామాధ్యక్షుడిగా రవీందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్, కార్యదర్శిగా మల్లేశ్‌యాదవ్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, వెంకటేశ్ యాదవ్, కె.మహేశ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు రాజుయాదవ్ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి 'భద్రత'

పెద్దఅంబర్‌పేట, మార్చి 25: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ హరీశ్‌బాబు కుటుంబానికి రాచకొండ సీపీ సుధీర్‌బాబు అండగా నిలిచారు. హరీశ్ బాబు భార్య ప్రియాంకకు మంగళవారం రూ.3.99 లక్షల విలువైన భద్రత చెక్కును అందజేశారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని, శాఖ నుంచి అందాల్సిన పరిహారాలను వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రియాంకకు చెక్కు అందజేస్తున్న సీపీ